

పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పర్యవేక్షణ

రేపటి నుంచి డీఎడ్ పరీక్షలు

- విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో హాజరుకావాలి
- ఆలస్యమైతే పరీక్షకు అనుమతించం: డీఈవో

నిర్మల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1 నుంచి బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో డీఎడ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్మల్ జిల్లావిద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు. నిర్మల్ పట్టణంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షా కేంద్రానికి సకాలంలో హాజరుకావాలని, ఆలస్యమైతే పరీక్షకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ పరీక్ష నిర్వహణకు చీఫ్ సూపరింటిండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, సిట్టింగ్ స్క్వాడ్‌లతోపాటు ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు. పరీక్ష నిర్వహణ సమయంలో పరీక్షాకేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు లో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లన్నీ మూసేయాలని చెప్పారు. పరీక్షలను సీసీ టీవీ, పోలీస్ బందోబస్తు మధ్య పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

కబడ్డీ విజేత రాజులగూడ

పెంబి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకొని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం టీఏజీఎస్ ఆధ్వర్యంలో పెంబి మండలంలోని రాముగూడ గ్రామంలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొనగా అందులో రాజులగూడ, రాముగూడ జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. ఇందులో రాజులగూడ గెలుపొందింది. గెలుపొందిన రాజులగూడకు మొదటి బహుమతి రూ.5వేలు, షీల్డ్, రెండో బహుమతి రూ.3వేలు షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, బడుగు మల్లేష్, ఎస్సై హన్మాండ్లు, బాలాజీ, మాధవి, బాపురావు, పెంద్రం దత్తురాం, నైతం దుర్గు, అర్జున్, తదితరులు ఉన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న గిరిజన నాయకులు

పల్లెకు ఎన్నికళ

- మొదలైన పంచాయతీ ఎలక్షన్ల కోలాహలం
- తొలి విడత నామినేషన్లు పూర్తి
- నేటి నుంచి రెండో విడత ప్రారంభం
- బీసీ అస్త్రాన్ని వాడుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ
- గెలుపు గుర్రాల కోసం రాజకీయ పార్టీల వేట
- బలమైన అభ్యర్థులను బరిలో దించేందుకు వ్యూహం



సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇప్పటికే తొలి విడత నామినేషన్లు పూర్తి కాగా రెండో విడత నేటి దరఖాస్తుల స్వీకరణ ఆదివారం నుంచి స్వీకరించనున్నారు. ఆశావహులు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. రోడ్డు వెంట వెళ్లేవారిని సైతం పలకరిస్తూ వారికి ఏ అవసరమున్న తీరుస్తూ అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ అవకాశం దొరికినా తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

నిర్మల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం మొదలైంది. జిల్లాలో ఇప్పటికే మొదటి విడత పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల స్వీకరణ ముగిసింది. ఆదివారం నుంచి రెండో విడత నామినేషన్‌లు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో గెలుపు గుర్రాలపై రాజకీయ పార్టీలు దృష్టిపెట్టాయి. గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎంపికలో రాజకీయ పార్టీలు ద్వితీయశ్రేణి నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తూ బలమైన అభ్యర్థులనే బరిలో దించేందుకు వ్యూహ రచన చేస్తున్నాయి. ప్రధానంగా అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లతో పాటు జిల్లాలో బలంగా ఉన్న బీజేపీ సైతం అన్ని స్థానాలలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. గ్రామాల్లో పేరు ఉన్న ఆశావహులను బరిలో దించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఎవరి వ్యూహాలు వారివే..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపుతో నూతన ఉత్సాహంతో ముందుకెళ్తుంది. అదే ఉత్సాహంతో పంచాయతీ, వార్డు ఎన్నికల్లో సత్తాచాటి అత్యధిక స్థానాలు గెలిచే విధంగా వ్యూహాలు రచిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రధాన ఎజెండాగా గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నికల్లో పార్టీ గుర్తు లేకున్నా తమకు అనుకూలంగా ఉన్న వారిని పోటీలో నిలిపేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల మహిళా సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ, పావలా వడ్డీ రుణాలు, ఉచిత బస్సు, సన్న బియ్యం, సన్న ధాన్యానికి బోనస్ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తుంది. ఆరు గ్యారంటీల అమలుతో పాటు రైతు భరోసా,బోనస్ ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామాలకు కేంద్రం ద్వారా వచ్చే నిధులు తదితర అంశాలను ప్రజలకు వివరిస్తూ ఓటర్లను ప్రసన్నంచేసుకునే పనిలో బీజేపీ నేతలున్నారు.

బీఆర్ఎస్, బీజేపీలకు అస్త్రంగా బీసీ రిజర్వేషన్లు..

స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపి ఆ తర్వాత అసెంబ్లీలో తీర్మానించినా.. గత సెప్టెంబరులో ఇచ్చిన స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడంతో తిరిగి ప్రభుత్వం పాత పద్ధతుల్లోనే రిజర్వేషన్‌లను ఖరారుచేస్తూ పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైంది. గవర్నర్ ఆర్డినెన్స్‌ను ఆమోదించలేదని ఢిల్లీలో సైతం ధర్నా చేసిన అధికార కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు గ్రామాల్లో ఇచ్చిన బీసీ రిజర్వేషన్‌లు తలనొప్పిగా మారాయి. గతంలో కంటే ఒకటి రెండు శాతం బీసీల రిజర్వేషన్‌లు పెరిగిన ప్రభుత్వం ఇచ్చిన 42శాతం రిజర్వేషన్‌లు అమలు కాకపోవడంతో బీసీ లంతా గుర్రుగా ఉన్నారు. ఇదే అంశాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు పంచాయతీ ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా వాడుకుంటున్నాయి. ఇప్పటికే ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలు ఇదే అంశాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి పంచాయతీ ఎన్నికల్లో లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నాయి. పార్టీపరంగా 42శాతం రిజర్వేషన్‌లు అమలుచేస్తామని అధికార పార్టీ నేతలు చెబుతున్నా.. అది ఏ మేరకు అమలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

నేటి నుంచి రెండో విడత నామినేషన్ల ప్రక్రియ షురూ

సారంగాపూర్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల 32 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డుమెంబర్‌ల నామినేషన్ ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకాంతారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామ పంచాయతీల కార్యాలయాలు, రైతువేదికల్లో సర్పంచ్, వార్డుమెంబర్‌లకు పోటీచేసే అభ్యర్థులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్‌ల దరఖాస్తులను సమర్పించుకోవాలని పేర్కొన్నారు.

ఖానాపూర్ మన్‌కీ బాత్ కన్వీనర్‌గా నారాయణ

ఖానాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమ ఖానాపూర్ పట్టణ కన్వీనర్‌గా ఎనగందుల నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు నారాయణ తెలిపారు. తన బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండల కన్వీనర్ మధుకర్ రెడ్డి

సోన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి శనివారం బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. మండల కన్వీనర్ మధుకర్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో మాజీ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును కలిసి పార్టీలో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

బాసరలో గోమాత మహా హారతికి శ్రీకారం

- వేద భారతి ఆధ్వర్యంలో ప్రతీ శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమం

బాసర,నవంబరు29 (ఆంధ్రజ్యోతి): జ్ఞానసరస్వతి క్షేత్రం బాసరలో ఆధ్యాత్మిక శోభ మరింత పెరిగింది. సకల దేవతలకు ప్రతిరూపంగా భావించే గోమాతకు మహా హారతి పూజ కార్యక్రమానికి బాసర వేద భారతి పీఠం ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ప్రతీ శనివారం సాయంత్రం ఈ మహోత్తరకార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వేద భారతి పీఠం ఆశ్రమంలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గోమాతకు వివిధరకాల హారతులతో ఘనంగా పూజలు నిర్వహించారు. త్రినాథ స్వామి వ్రతం, రుద్రాభిషేకం, గోపూజ, గోహారతి, అన్నదానం వంటి వివిధ కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా వేద భారతి పీఠం స్వామిజీ భారతి స్వామి మాట్లాడుతూ గతంలో స్థానికుల సహకారంతో చేపట్టిన గోదావరి మహాహారతి విజయవంతమైందని చెప్పారు. గోవుల పట్ల భక్తి భావాన్ని కొనసాగించడంలో భాగంగానే మహాహారతి పూజా కార్యక్రమాలను కొనసాగించడంలో భాగంగానే గోమాత హారతి చేపట్టామని వివరించారు.



గోమాత హారతి పూజ నిర్వహిస్తున్న వేద విద్యార్థులు

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పూజలో అయ్యప్ప స్వామి భక్తులు

నిర్మల్‌కల్చరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమల్‌రోడ్, నాయుడువాడలో కొలువైన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మందిరం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. నిర్మల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన, మహిళా సంఘాలఆధ్వర్యంలో ఆలయంలో వాసవిమాత పారాయణం, వాసవిమాత పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం అయ్యప్ప స్వామి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ పడిపూజ మహోత్సవం అయ్యప్ప స్వామి కరుణా కటాక్షములతో అంగరంగ వైభవంగా సాగింది. నిర్మల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడశ్రీధర్, ఆలయ మేనేజింగ్ చైర్మన్, ధర్మకర్తలు తాటికొండ (పార్థికర్)న ఆరాయణ, యువజన, మహిళాసంఘాల సభ్యులు ముందుకు ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని నిర్మల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం, కార్యవర్గం, వాసవి కన్యకా పరమేశ్వరి దేవి మందిరం, చిలువరి భవన్, కమల్ రోడ్, నాయుడువాడ, నిర్మల్ ధర్మకర్తలు విజయవంతం చేశారు.

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ తంబుడియ ప్రవీణ్‌శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో భాగంగా అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రహ్మణ్య స్వాములకు అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి నిర్మల్ జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా గురుస్వామి శనిగారపు చిన్నయ్య, గురుస్వామి మూర్తి, కుంటాల గురుస్వాములు పాల్గొని పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ లోలం శ్యాంసుందర్, వాసవి కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్‌లు సాయిలు, శ్రీనివాస్, సంతోష్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

దివ్యాంగులను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్



దివ్యాంగులతో క్యారం ఆడుతూ

నిర్మల్‌కల్చరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను అన్నిరంగాల్లో ప్రోత్సాహకం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు అందరూ ప్రోత్సాహకాన్ని అందిస్తూ, సమాజంలో భాగస్వామ్యం చేయాలన్నారు. గతంలో ఎంతోమంది దివ్యాంగులు పట్టుదలతో శ్రమించి వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని గుర్తుచేశారు. ఇటీవల అందులో క్రికెట్ ప్రపంచ కప్ భారతజట్టు గెలుచుకుందని ఉదాహరించారు. దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. తప్పకుండా డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించి, సమస్యలను తెలుసుకుంటూ, తగు చర్యలు చేపడతామని తెలిపారు. దివ్యాంగులు తమ నైపుణ్యాలు పెంచుకొని, వివిధ రంగాలలో ప్రగతి సాధించాలని సూచించారు. జెండాను ఊపడం ద్వారా దివ్యాంగుల పరుగు పందెపు పోటీలను ప్రారంభించారు. పోటీలలో పాల్గొన్న వారిని అభినందించారు. దివ్యాంగులతో కలిసి చెస్, క్యారమ్ బోర్డు ఆడారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీవైఎస్‌వో శ్రీకాంత్, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, సంక్షేమశాఖ అధికారులు, ఇతర శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఈవీఎం గోదాంల తనిఖీ

కలెక్టరేట్ సమీపంలోగల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీస్ సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి రద్దు: కలెక్టర్

గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో వచ్చే సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళి కొనసాగుతున్నంత వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడదని, కోడ్ ముగిసిన వెంటనే ప్రజావాణి తిరిగి యథావిధిగా ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు.

భీమన్నగుట్ట సమస్యను పరిష్కరించేందుకు చర్యలు

నిర్మల్‌కల్చరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భీమన్నగుట్ట భూముల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ హామీ ఇచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్మల్ ముదిరాజ్ సంఘ బృందం సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు చెప్పారు. ప్రభుత్వఆదేశాలు రాగానే, ఆ ఆదేశాలను అనుసరించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ముదిరాజ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న, జిల్లా అధ్యక్షుడు గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి, యువజన సంఘ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి చరణ్, ఉపాధ్యక్షుడు అర్జున్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమింపజేసిన ఆర్డీవో

భీమన్నగుట్టసమస్య పరిష్కారం కోసం గత ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నవారితో ఆర్డీవో రత్న కళ్యాణి నిమ్మరసాన్ని అందజేసి దీక్షను విరమింపజేశారు. తమ ఆందోళనలను అర్థం చేసుకొని, సమస్య పరిష్కారం కోసం చొరవ తీసుకున్నందుకు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు, దీక్షవిరమింపజేసిన ఆర్డీవోకు దీక్ష చేపట్టినవారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రాజు ఉన్నారు.

నేడు తహసిల్ కార్యాలయానికి సెలవు లేదు

కుంటాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కుంటాల తహసీల్ కార్యాలయాన్ని ఆదివారం లేదని అధికారులు తెలిపారు. మండలంలో ఐదుచోట్ల నామినేషన్లు స్వీకరించనున్న దృష్ట్యా రిజర్వుడ్ స్థానాల్లో కులధ్రువీకరణ పత్రాలు జతపరచాల్సి ఉన్నందున ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్లు వేసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



- సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్

భైంసా, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో రెండు, మూడో విడతలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లుగా భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రెండో విడతలో భైంసా డివిజన్ పరిధిలో కుంటాల మండలంలో 15, లోకేశ్వరం మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయని వివరించారు. ఇక మూడోవిడతలో మొత్తం 133 గ్రామపంచాయతీలకు ఎన్నికలు ఉంటాయని, ఇందులో భైంసా మండలంలోని 30, కుభీర్ మండలంలోని 42, తానూర్ మండలంలోని 32, ముథోల్ మండలంలోని 19, బాసర మండలంలోని 10 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు. క్లస్టర్ల వారీగా నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తయ్యిందని చెప్పారు. పీవో, ఏపీవోలతోపాటు రూట్, జోనల్ అధికారుల నియామకం పూర్తయ్యిందన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా పూర్తిచేసేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టినట్లుగా వివరించారు.

తనిఖీ కేంద్రాల ఏర్పాటు

ఎన్నికల వేళ పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి మద్యం, డబ్బు, ఇతరత్రా అక్రమ రవాణా జరుగకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా వివరించారు. కుభీర్ మండలంలోని సిర్పెల్లి (హెచ్), సేవాలాల్ తండా, డొడర్నతండా, కుంటాల మండలంలోని దౌనెల్లి తాండ, తానూర్ మండలంలోని బెల్‌తరోడా, జౌల(బి), బాసర మండలంలోని బిద్రెల్లి వద్ద తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా వెల్లడించారు. సంబంధిత తనిఖీ కేంద్రాలు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు రౌండ్ ది క్లాక్ పని చేస్తాయని పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనల అమలుకు చర్యలు

డివిజన్ పరిధిలో ఎన్నికల నియమ, నియమావళి అమలు చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్టుగా వెల్లడించారు. ఎన్నికల కమిషన్ నియమావళి ఎక్కడైనా అధిగమించినట్లు గుర్తించినా, అధికార దుర్వినియోగం జరిగినా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ప్రధానంగా ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులున్న సెల్ నెంబర్ 9959284786 నెంబర్‌కు తెలియపరుచవచ్చునని వెల్లడించారు.

అందరూ సహకరించాలి

గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతవాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలతోపాటు పోటీదారులు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అధికారులకు సహకరించాలని కోరారు.



తెలంగాణ ఉద్యమంపై ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బీఆర్ఎస్ హయాంలో పురోగతి

- బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న
- జిల్లాకేంద్రంలో ఘనంగా దీక్ష దివస్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణను సాధించడం కేసీఆర్‌తో సాధ్యమా? అన్న సందేహాలకు సమాధానంగా ఆయన రాష్ట్రాన్ని సాధించి చూపారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పురోగతి పథంలో రాష్ట్రం నడిచిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. దీక్ష దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అదే స్ఫూర్తితో ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని నేతలు పిలుపునిచ్చారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. జిల్లా నలుమూలల నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కాగా.. పార్టీ కార్యాలయ ప్రాంగణం గులాబీమయంగా మారింది. దీక్ష దివస్ నాటి చాయాచిత్రాల ప్రదర్శనను వీక్షించి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అంతకుముందు లక్ష్మీపూర్, రామాయి గ్రామస్థులు, ధోబి కాలనీకి చెందిన పలువురు పార్టీలో చేరగా.. వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ మేరకు మాజీమంత్రి జోగురామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మనోహర్, యూనుస్ అక్బాని, తుల శ్రీనివాస్, పవన్ నాయక్, సతీష్ పవార్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'పై ప్రజలకు అవగాహన

తాంసి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నట్లు కిసాన్ మిత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ హర్ష అన్నారు. శనివారం మండల కేంద్రానికి వచ్చిన ప్రత్యేక బృందం ప్రజలకు ప్రజావాణిపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులకు ఎన్ని పరిష్కారం అయ్యాయో? ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లబ్ధిదారులకు న్యాయం జరిగిందో? లేదో? వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి దగ్గర ఉండి సెల్‌ఫోన్ లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.



అవగాహన కల్పిస్తున్న కిసాన్ మిత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ హర్ష

ముగిసిన తొలి విడత నామినేషన్ల

- నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ రాజేశ్వర్

సిరికొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సిరికొండ మండలంలో ఎన్నికల సందడి మొదలైంది. ఈ సందర్భంగా మండల పరిధిలోని సిరికొండ క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు స్థానిక సిబ్బంది తీసుకున్న భద్రతా చర్యలను, బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రయీస్ ఉల్లా, తహసీల్దార్ తుకారాం, ఎంపీవో సంతోష్, పోలీస్ సిబ్బంది, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఉన్నారు. కాగా, మరోవైపు మండలంలో తొలివిడత నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. మండలంలో ని ఐదు క్లస్టర్ల పరిధిలోని సర్పంచ్ స్థానాలకు 74 మంది అభ్యర్థులు, 236 వార్డు స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ లను దాఖలు చేశారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవో రాయిస్ ఉల్లాను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్

అర్హులైన ప్రతీ రైతుకు రుణం అందించాలి

- జిల్లా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిష్టర్ స్వప్న

తలమడుగు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా అర్హులైన రైతులందరికీ రుణాలు అందించాలని జిల్లా కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ అధికారి విస్వప్న కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇటీవల గ్రూప్-2లో ఉద్యోగం సాధించిన వి.స్వప్న, శివకుమార్‌లు శిక్షణలో భాగంగా తలమడుగు సంఘ కార్యాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘంలో సభ్యత్వ వివరాలు రైతులకు అందించే రుణాలు సంఘ బలోపేతానికి చేపట్టే కార్యక్రమాలు అంతేకాకుండా సంఘం ద్వారా రైతులకు అందించే రుణాలు వాటి వివరాలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా రుణాలు అందించాలని సూచించారు. ఇందులో సీఈవో మోతే శ్రీనివాస్, డైరెక్టర్ శ్రీనివాస్, సెక్రెటరీ సాగర్, సిబ్బంది రమాకాంత్, సత్యనారాయణ, గ్రామ పెద్దలు కాటిపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి చంటి రెడ్డి, స్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో తలమడుగు గ్రామానికి చెందిన వడ్నాల లక్ష్మణరావు కూతురు స్వప్న జిల్లా కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్‌గా ఉద్యోగం సాధించడంతో శిక్షణలో భాగంగా మొదటిసారి తలమడుగు గ్రామానికి రావడంతో ఆమెను గ్రామ పెద్దలు కాటిపేల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి చంటి, స్వామిరెడ్డిలు సన్మానించారు. ఇదే స్ఫూర్తితో ప్రతీఒక్కరు కష్టపడి చదువుకొని ఉద్యోగ రంగంలో ముందుకు వెళ్లాలని సూచించారు.



సొసైటీలో స్థానిక సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారి

గ్రామాల అభివృద్ధికి కృషి : ఆదిలాబాద్ ఎమ్మెల్యే

జైనథ్/ ఆదిలాబాద్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం బోరజ్ మండలంలోని రాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రాంపూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లింగన్న, మాజీఉప సర్పంచ్ నందు, సింగిల్ విండో డైరెక్టర్‌లు ఎమ్మెల్యే పాయలశంకర్ సమక్షంలో బీజేపీలో చేరారు. చేరిన వారికి బీజేపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఈ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సర్పంచ్ లుగా గెలుపొందిన వారికి గ్రామ పంచాయతీకి రూ.25 లక్షలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.రమేష్, బీజేపీ బోరజ్ మండల అధ్యక్షుడు గాజుల సన్నీ, నాయకులు నాందేవ్, అశోక్ రెడ్డి, రమేష్, గటిక క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



రాంపూర్‌లో బీజేపీలో చేరిన నేతలకు కండువాలు కప్పుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

నేతలకు.. 'పంచాయతీ' పరీక్ష!

(5వ పేజీ తరువాయి...)

అన్నట్లుగా కనిపిస్తోంది. గ్రామాల్లో అసమ్మతి నేతలను గుర్తిస్తూ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలో కొత్తగా చేరుతున్న వారికి సర్పంచ్, వార్డు మెంబర్ పదవులను ఆఫర్ చేస్తూ ఖర్చుల పేరిట ఎంతో కొంత సొమ్మును ముట్టచెబుతున్నట్లు తెలుస్తుంది.

క్యాడర్‌కు డైరెక్షన్

ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు గ్రామస్థాయి కార్యకర్తలతో వరుస సమావేశాలను నిర్వహిస్తూ ముఖ్యనేతలతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించే విధంగా ప్రయత్నాలు చేయాలని డైరెక్షన్ చేస్తున్నారు. పార్టీలో ఉన్న లోటుపాట్లను పరిష్కరిస్తూ సమన్వయం దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామాల్లో మంచి పలుకుబడి, పరపతి ఉన్న నేతలతో మాట్లాడుతూ అభ్యర్థులను గెలిపించాలని ఆదేశిస్తున్నారు. తమ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీలు ఇస్తున్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు గ్రామాలకు పోటాపోటీగా హామీలు గుప్పించడంతో ఓటర్లు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు నేతలు హామీలు ఇవ్వడం, ఆ తర్వాత మరిచిపోవడం సర్వసాధారణంగానే మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్

టెన్త్, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఆదిలాబాద్ డీఈవో

సిరికొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, పాఠశాల కార్యకలాపాలు, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. సందర్శన సమయంలో, ఉపాధ్యాయులను అంకితభావంతో పనిచేయాలని సూచించారు, విద్యార్థులతో మాట్లాడి వారి ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గదుల పరిశుభ్రత, వసతులు, ఆహార నాణ్యత, భద్రత వంటి అంశాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కోలాం పాఠశాలలో అవగాహన సదస్సు

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఇంటర్‌నేషనల్ డే ఫర్ ద ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ అగెనిస్ట్ ఉమెన్ అండ్ 16 డేస్ ఆఫ్ యాక్టివిజమ్ కార్యక్రమంలో భాగంగా కోలాం పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పై హింసను ముగించడంలో పురుషులు, బాలుర పాత్ర, అలాగే హింసను గమనించినప్పుడు స్పందించే విధానం, గృహహింస అండ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నిలబడే బాధ్యత అనే అంశాల పై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం ఇన్ చార్జి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ లావణ్య, కోలాం పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణ, సఖీ కేంద్రం సిబ్బంది నాగమణి, టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



గోవింద్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

జడ్పీ సీఈవోగా గోవింద్ సేవలు మరువలేనివి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్ గేట్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈవో గోవింద్ సేవలు మరువలేనివని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో శనివారం జిల్లాపరిషత్ సీఈవో గోవింద్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని అన్నారు. గోవింద్ నిత్యం అందుబాటులో ఉంటూ, తన కర్తవ్యాన్ని క్రమశిక్షణతో నిర్వర్తించారని అన్నారు. జిల్లా ఇన్ చార్జి ఉపాధి కల్పన అధికారిగా కూడా ఆయన విశేషమైన సేవలు అందించారన్నారు. అనంతరం జడ్పీ సీఈవో గోవింద్ దంపతులను కలెక్టర్, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, సీపీవో జీవరత్నం, జడ్పీ సీఈవో కుటుంబ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల లబ్ధి కోసమే ఇందిరమ్మ చీరల పంపిణీ : బీఆర్ఎస్

భైంసా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసమర్థ పాలనతో ప్రజా ఆదరణ కోల్పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టిందని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. శనివారం భైంసాలో నియోజకవర్గ ప్రాంతంలోని వివిధ ప్రాంత పార్టీవాసులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాలనలో అన్నివిధాలుగా వైఫల్యం చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుట్రపూరిత విధానాలతో వ్యవహరిస్తోందన్నారు. ఇందులో భాగంగానే సమయం కాకున్నా, సందర్భం లేకున్నా ఇందిరమ్మ చీరలతో మహిళల ఓట్లు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేపట్టిందన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ పట్ల వ్యతిరేక వాతవరణం నెలకొందన్నారు. ప్రస్తుతం అన్నివర్గాల ప్రజలు కేసీఆర్, బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అనుకూలమైన వాతరవరణాన్ని పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని సత్తాచాటాలని కోరారు. ఇందులో బీఆర్ఎస్ బాసర కన్వీనర్ కోర్వాశ్యామ్, మాజీఎంపీటీసీ దేవిదాస్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న డా.కిరణ్ కోమ్రేవార్

ధర్మ పరిరక్షణకు అందరూ కట్టుబడి ఉండాలి

- దసరా ఉత్సవ సమితి కన్వీనర్ గొజ్జ జనార్ధన్

నిర్మల్‌చైన్ గేట్‌నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ హైందవ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని దసరా ఉత్సవ సమితి కన్వీనర్ గొజ్జ జనార్ధన్ పేర్కొన్నారు. దసరా నవరాత్రుల వేడుకలను పురస్కరించుకొని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రామాయణ, మహాభారతం గ్రంథాల విశిష్టతపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల విజేతలకు శనివారం స్థానిక జుమ్మెరాత్ పేట్ హైస్కూల్‌లో బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొజ్జ జనార్ధన్ మాట్లాడుతూ ప్రతియేటా దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు హైందవ ధర్మ ప్రాధాన్యాత అలాగే విశిష్టతపై వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తాము హిందూ సాంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతలను ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రభు, వీహెచ్‌పీ ప్రచారక్ రఘువీర పాణి, స్కూల్ హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబు, టీచర్లు వినోద్, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, భోస్లే గంగాధర్, రమణ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రేపు నర్సాపూర్ రామాలయంలో గ్రంథాలయం ప్రారంభం

నర్సాపూర్(జి), నవంబరు29 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీశ్రీ రామ మందిరము ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ సీతారామ ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఉద్యోగ అన్వేషణలో ఉంటూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల ప్రయోజనార్థం ఉద్దేశించిన గ్రంథాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లాసీనియర్ సివిల్ న్యాయాధికారి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.రాధిక హాజరుకానున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు గోపిడి గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు దర్శనం సుధాకర్, సలహాదారు పి.గంగారాం తెలిపారు.

సరస్వతీ శిశుమందిర్ పాఠశాల పరిశీలన

ముథోల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలను శ్రీ సరస్వతీ విద్యా పీఠం రాష్ట్ర విద్యా విషయక పర్యవేక్షణ అధికారి (శైక్షణిక ప్రముఖ్) నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, జోనల్ విద్యా విషయక పర్యవేక్షణ అధికారి (శైక్షణిక ప్రముఖ్) కలిమహంతి వేణుమాధవ్‌లు పర్యటనలో భాగంగా పాఠశాలను సందర్శించారు. ఉన్నత తరగతులలోని విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాఠశాల సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, పాఠశాల అధ్యక్షుడు కే. సంజీవ్, కార్యదర్శి వేదపాఠక్, నిశికాంత్, ప్రధానాచార్యులు సారథి రాజు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే అన్నీ సాధ్యమే

నిర్మల్ చైన్ గేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే అన్నీ సాధ్యమవుతాయని వైద్యుడు, ఐరన్ మ్యాన్ అవార్డు గ్రహీత డాక్టర్ బిఎల్ నరసింహారెడ్డి అభిప్రాయపడ్డారు. జిల్లాకేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు పరీక్షలను ఎదుర్కొవడంతోపాటు భవిష్యత్తుకు బాటలు ఎలా వేసుకోవాలోనన్న అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పక్కవారితో చదువులతోపాటు వ్యక్తిత్వ వికాసంపై అంచనా వేసుకోవద్దని, అందరూ సమానమేనన్న ఆలోచనతో చదువుకోవాలని సూచించారు. గొప్పవారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని శ్రమను నమ్ముకోవాలని, ఫలితాలు వాటంతట అవే వస్తాయని అభిప్రాయపడ్డారు. పరీక్షల సమయంలో ఒత్తిడి లేకుండా ఏకాగ్రత పెంచుకోవాలని సూచించారు. ఇందుకు మెడిటేషన్, యోగా, శారీరక వ్యాయామం వంటి అంశాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారెడ్డిని కళాశాల యాజమాన్యం సత్కరించింది.

ముగిసిన తొలి విడత నామినేషన్ల ప్రక్రియ

లక్ష్మణచాంద, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలో నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. ఎంపీడీవో రాధారాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం మొత్తం మీద సాయంత్రం 5 గంటల వరకు 219 నామినేషన్లు వచ్చాయి. అత్యధికంగా బోరిగాం గ్రామంలో 23 నామినేషన్లు రాగా వడ్యాల్ తండాలో ఒక్క నామినేషన్ కూడా రాకపోవటం విశేషం.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

కుంటాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు భైంసారూరల్ సీఐ నైలు పేర్కొన్నారు. మండలంలోని విట్టాపూర్ గ్రామంలో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని ప్రజలు ఎలాంటి గొడవలకు తావివ్వకుండాప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ద్విచక్రవాహనాలను తనిఖీచేశారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు ద్విచక్రవాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నేటి సమాజంలో సైబర్ నేరాలకు చాలామంది గురవుతున్నారని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మూఢనమ్మకాలు, ఆర్థిక మోసాల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుంటాల ఎస్ఐ అశోక్, కుభీర్ ఎస్ఐ, కుంటాల పోలీసు సిబ్బంది ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నైలు



హైకోర్టు న్యాయమూర్తికి అమ్మవారి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

బాసరలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

బాసర, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి మాధవిదేవి సందర్శించారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు శాస్త్రపుతంగా ఆమెకు ఆశీర్వచనలు అందించారు. కార్యక్రమంలో వెంట ఆలయ ఈవో అంజనదేవి, నిజామాబాద్ న్యాయాధికారి భారతిలక్ష్మీ, అడిషనల్ న్యాయాధికారి కుష్బూ, ఉపాధ్యాయ, భైంసా న్యాయాధికారి దేవేందర్‌బాబు ఇతర అధికారులున్నారు.

ఆర్జీయూకేటీలో క్రికెట్ పోటీలు

బాసర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో రైజింగ్ స్టార్స్ జట్టు విజేతగా నిలవగా వీసీ గోవర్ధన్ బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీప్రొఫెసర్ మురళిదర్శన్, అధికారులున్నారు.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న వీసీ

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు

సారంగాపూర్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ కృష్ణ అన్నారు. శనివారం మండలంలో గల స్వర్ణ గ్రామంలో రైతువేదికలో ఎన్నికల నియమవాళిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి రెండోవిడత సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, నిబంధనల ప్రకారం అభ్యర్థితోపాటు ఇద్దరు బలపర్చే వ్యక్తులే నామినేషన్ కేంద్రాలోని అనుమతి ఉంటుందని తెలిపారు. అనంతరం రాంసింగ్ తండాలో ఏర్పాటు చేసిన తెలంగాణ సరిహద్దును తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఆకాష్, రవి, మాధవ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తానూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ మల్లేష్ అన్నారు. మండలంలోని కోలూర్ గ్రామంలో ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు శనివారం కమ్యూనిటీ కంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలను అలవాటు చేసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని వివరించారు. సరైన పత్రాలు లేని 55 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా గ్రామంలో కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. కార్యకరమంలో ఎస్సై, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తాం

- గొట్టి గ్రామస్థులు
- ఎస్టీలు లేకున్నా వారికే వార్డులు రిజర్వు

ఉట్నూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని కుగ్రామమైన గొట్టికి చెందిన ప్రజలు పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. గొట్టి గ్రామంలో 7, 8, 9 వార్డులు ఉండగా ఈ వార్డులన్నీ గిరిజనులకు రిజర్వ్ చేశారని, గొట్టి గ్రామంలో 100 శాతం షెడ్యుల్డు కులాల ప్రజలు ఉండగా షెడ్యులు తెగలకు ఎలా రిజర్వేషన్ చేస్తారని ప్రశ్నిస్తున్నారు. తమ గ్రామంలో ఎస్టీలు లేకున్నా వారికి వార్డులు రిజర్వు చేసినందున తమ గ్రామంలో ఉన్న 555 మంది ఓటర్లు పంచాయతీ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోబోమని, ఇప్పటికైనా జిల్లా అధికారులు మూడు వార్డులలో తమకే అవకాశం ఇవ్వాలనికోరుతున్నారు. ఈ విషయమ జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని ఎంపీడీవో రాంప్రసాద్ వినతి పత్రంలో తెలిజేశారని గ్రామస్థులు ముస్కర్‌నాగోసేన్, అరవింద్, భానుదాస్, సతీష్, ఇంద్రజిత్‌లు తెలిపారు.

ఎముకలు కొరికే చలిలో ఎన్నికల ప్రచారం

- తెల్ల తెల్లవారుతుండగానే కాలనీలోకి ఆశావాహులు

బోథ్,నవంబరు29(ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేవారు తెల తెలవారుతుండగానే కాలనీలోకి వెళ్తున్నారు. ఎముకలు కొరికే చలిలో సతం రానున్న ఎన్నికల్లో సర్పంచులు వార్డు సభ్యులుగా పోటీ చేసేవారు కాలనీలోకి వెళ్తున్నారు. ఎన్నడు కనిపించని వారు వారి వారి కాలనీలలో ప్రత్యక్షం కావడంతో ఎటు వచ్చారు అన్న అంటూ పలకరిస్తున్నారు. అయితే ఓట్లు అడిగే వారు మాత్రం అన్నా బాగున్నారా అంటూ ఇంటి దగ్గరికి వెళ్లి ఓటర్లను పలకరించడం జరుగుతున్నది.

అబ్బా ఇప్పుడు గుర్తుకు వచ్చామా...

గీ అన్న గిప్పుడు వచ్చిండు ఎందుకు వచ్చినట్లు అని పక్క వాళ్లని అడిగితే అరె భ ఓట్ల పండుగ వచ్చింది ఓట్ల కోసం వస్తున్నారు అని ఇంకొకరు సమాధానం చెబితే అమ్మ అయనకు మనం ఇప్పుడు గుర్తుకు వచ్చామా అంటూ చర్చించుకుంటున్నారు. కొందరేమో ఏమనుకున్నా పర్వాలేదు ముందు ముందు మీ సేవకులమే ఓటేసి ఆదరించండి నేను బరిలోకి దిగుతున్న అంటూ ముందస్తు ప్రచారం చేసుకుంటున్నారు.

ఆశపడ్డ వారికి కలిసిరాని రిజర్వేషన్లు



స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేస్తామని ముందు చూపుగా ఎంతో మంది సేవా కార్యక్రమాలు చేపట్టారు. అయితే సర్పంచి పదవిపై గురిపెట్టి సేవా కార్యక్రమాలు చేసిన వారిని రిజర్వేషన్లు కలిసి రాకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. గణపతులకు చెందాలు దుర్గాదేవికిచందాలు బతుకమ్మలకు చెందాలు ఇచ్చిన నాయకులు రిజర్వేషన్ దెబ్బతో సైలెన్స్ అయిపోయారు.అయినా ముందు ఎంపీటీసీలు జడ్పీటీసీల రిజర్వేషన్లు మాకు వర్తిస్తాయెమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.ఏదిఏమైనా ఆశలపల్లకిలో ఉన్ననాయకుల భవిష్యత్తు ఇప్పుడు లేకున్నాముందు ఆయన ఉంటుందన్న ఆశతో ఉన్నారు.


పోచమ్మ గల్లీ కాలనీలో బోరుబావికి ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్

ఇంటింటికి కుళాయినీరు పోచమ్మ గల్లీ ప్రజల తీరు

మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీలో ఇంటింటికి బోరుబావి నీటిని సరఫరా చేసుకుంటున్నారు. మిషన్ భగీరథ నీరు అప్పుడప్పుడు రాకపోవంతో వచ్చిన ఆ నీటిని బయటి అవసరాలకువాడుకుంటే బోరుబావుల ద్వారా సరఫరా అయ్యే నీటిని తప్పకుండా వాడుకోవాల్సి వస్తున్నది మిషన్ భగీరథ నీరు సరిపోక పోవడంతో బోరుబావి దగ్గర ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్ల ద్వారా నీటని ఇళ్ల వరకు వేసుకుని వాడుకుంటున్నారు. కాలనీలో ఐదు చోట్ల బోరుబావులకు ఈ విధంగా కుళాయి పైపులు ఏర్పాటు చేసుకుని తమ తమ ఇంటి వరకు నీటిని తీసుకు వెళ్తున్నారు.

మహావీర్ తండా సర్పంచ్ పదవికి వేలం

- నిర్మల్ జిల్లాలో రూ. 5.65లక్షలకు పదవిని దక్కించుకున్న వైనం


వేలంలో సర్పంచ్ పదవిని దక్కించుకున్న సర్పంచ్ భర్త దిలీప్

సారంగాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మహావీర్‌తండా గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి శనివారం వేలం నిర్వహించారు. ఈ తండాలో 246 మంది మహిళ ఓటర్లు, 244 మంది పురుషులు ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వేషన్ అయింది.వివిధ పార్టీల మద్దతుతో బరిలో నిలిచే మహిళా అభ్యర్థుల తరఫున వారి భర్తలు దిలీప్, రవీందర్,రాజు, ఉత్తమ్ ధన్సింగ్ వేలంలో పాల్గొన్నారు. రూ. 5లక్షల65వేలకు ఆడే సంచిబాయి భర్త దిలీప్ అనే వ్యక్తి ఈ సర్పంచ్ పదవిని దక్కించుకున్నట్లు తండాకు యువకులు తెలిపారు. దీంతో మహావీర్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఆడే సంచిబాయిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి తీర్మానించినట్లు తండా వాసులు తెలిపారు.

కాంగ్రెస్ గూటికి నాగమల్యాల్ గ్రామస్థులు

- ఆడె గజేందర్ సమక్షంలో చేరికలు
- అభివృద్ధిని చూసే కాంగ్రెస్ వైపు ప్రజల మొగ్గు: ఆడే గజేందర్


పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడె గజేందర్

నేరడిగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగమల్యాల్ గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ సమక్షంలో వీరంతా పార్టీ కండువా కప్పుకున్నారు. వారికి ఆడె గజేందర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకొని, గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచేలా చూడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేళ్లు గంగారాం, తోట గంగాధర్, గంగారాం, యువ నాయకులు మహేందర్, మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, రావు కుంటాల మాజీ సర్పంచ్ అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బానోత్ వసంత్, జాదవ్ కపిల్ దేవ్,ఆడే రమేష్, వసంతరావు,ఎండి సద్దాం, మౌలానా, గజ్జల అశోక్, గట్టు అశోక్, సంతోష్, దేవేందర్, లక్ష్మణ్, నాయకులు, తదితరుల పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

భైంసారూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వానల్ పాడ్ గ్రామం బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా లావణ్య అనే మహిళ కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శంకర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వటోలి గ్రామానికి చెందిన లావణ్య వానల్‌పాడ్ బస్టాండ్ వద్ద నిర్మల్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. డ్రైవర్ బ్రేక్ వేయడంతో కింద పడిపోయి, ఆమె కాలు విరిగింది.స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆమెను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వాహనాల తనిఖీ

- బిదిరెల్లి వద్ద ఆరు వాహనాల సీజ్


వాహనాల తనిఖీ చేస్తున్న అధికారులు

బాసర/ఉట్నూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాసర మండల బిదిరెల్లి వద్ద రాష్ట్ర సరిహద్దులో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రజినికాంత్, ఆసీఫ్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా నడిపిస్తున్న 6 వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీ ఎన్నికల దృష్టిలో ఉంచుకొని రోజు వారిగా కాకుండా తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఉట్నూర్‌త గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని లింగోజితండా ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేం ద్రంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని నిరోదించడానికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉట్నూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రాంతాల నుంచి ఆదిలాబాద్‌వైపు రాకపోకలు సాగిస్తున్న జీపులు, కారులను, గూడ్స్ వాహనాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్యాంసుందర్, పోలీసు కానిస్టేబుల్ లకావత్ ఇందల్ తదితరులున్నారు.

ప్రైవేట్ పాఠశాలలో కలకలం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉండే ఓ ప్రైవేట్ పాఠశాలలో మాస్క్ మ్యాన్ కలకలం సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం లంచ్ సమయంలో పాఠశాల లోపలికి మాస్క్ ధరించి వచ్చిన ఓ వ్యక్తి.. ప్రైమరీ విద్యార్థులకు సుర్మా(కాటుక) డబ్బాలను ఇచ్చాడు. ఈ విషయాన్ని గ్రహించిన ఉపాధ్యాయురాలు, సిబ్బంది చిన్నారుల నుంచి వాటిని తీసుకొని.. వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే పిల్లలకు సుర్మా అందించిన వ్యక్తి పోలీసులకు శనివారం చిక్కినట్లు తెలుస్తోంది. చిన్నారులకు వాటిని ఎందుకు అందించాడన్న కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేయగా....తాజాగా జరిగిన ఘటన పాఠశాల యాజమాన్యాలను ఉలిక్కిపడేలా చేసింది.

వ్యవసాయ కూలి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీం సారి గ్రామ సమీపంలో శనివారం పురుగుల మందు తాగివ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందిన ఇప్పరామన్న శుక్రవారం సాయంత్రం పనుల నిమిత్తం ఇంటి నుంచి బయలదేరి వెళ్లాడు. కాగా శనివారం రూరల్ మండలం భీం సారి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న పొదల్లో పడి ఉన్న రైతును అటుగా పొలంపనులకు వెళ్తున్న స్థానిక రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.అక్కడికి చేరకున్న పోలీసులు హైవేఅంబులెన్స్ సిబ్బంది వెంటనే రైతును జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.అప్పటి కే రైతు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు కారణంగా వ్యవసాయ కూలి ఆత్మహత్యకు రూరల్ ఎస్సై అలీమ్ తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళలపై హింసను నిర్మూలిద్దాం

- సఖి ఆధ్వర్యంలో అవగాహన


అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీలు

బజార్‌హత్నూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు ఐక్యత అవసరమని సఖి కేంద్రం నిర్వాహకురాలు లావణ్య అన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా మండలంలోని పిప్రి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలికలు, మహిళలు ఆత్మన్యూనత భావాలకు, ప్రలోభాలకు లోనూ కాకూడదన్నారు. మహిళల, బాలికల సంరక్షణ చట్టాలైన గృహ హింస, పోక్సో , బాల్యవివాహాల నిరోధక చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యాలయం, పని స్థలాల్లో వేధింపులపై సోషల్ మీడియా, చాట్ యాప్‌లలో తప్పుడు ఫోటోలు సృష్టిస్తూ వ్యక్తిగత ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. అలాగే సఖి కేంద్రం అందించే ఐదు రకాల సేవలతో పాటు హెల్ప్ లైన్ నంబర్లు 181, 1098, 1930, 100 సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలవంతపు చేరికలు చెల్లవు

- అధికారాన్ని దుర్వినియోగం చేస్తే సహించేది లేదు
- ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతానికి కట్టుబడే ఉంటాం
- నాగ మల్యాల్ మాజీ సర్పంచ్, పటేళ్లు


ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ గూటికి చేరిన నాగమల్యాల్ గ్రామస్థులు

నేరడిగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇతర పార్టీల నాయకులను బలవంతంగా తమ పార్టీలో చేర్చుకుంటోందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. నేరడిగొండ మండలంలోని నాగ మల్యాల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భీముడు, నారాయణ, గ్రామ పటేళ్లు గంగారాం, తోట గంగాధర్, గంగారాంలను శనివారం కాంగ్రెస్ నాయకులు బలవంతంగా పార్టీలో చేర్చుకున్నారని, ఆ వెంటనే వారు ఆ చేరికను తిరస్కరించి తిరిగి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతామని ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ భీముడు మాట్లాడుతూ తమను బలవంతంగా కాంగ్రెస్ కండువా కప్పారని, తాము ఎల్లప్పుడూ బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకత్వానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం వీరంతా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో తిరిగి గులాబీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. అధికారం ఉందని బీఆర్ఎస్ నాయకులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, అనిల్‌యాదవ్,రాథోడ్ సురేందర్, సోమేశ్, ఆత్మరాం, కైలాష్, ఇందల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన బరంపురం తిరుమలకొండ


వేంకటేశ్వర ఆలయానికి తరలి వచ్చిన భక్తులు

తలమడుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభుగా వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేంకటస్వామి గోదాదేవికి అభిషేకం అర్చన నిర్వహించారు అలాగే ప్రతి శనివారం ఆదిలాబాద్ వాస్తవ్యుడు డాక్టర్ హేమలత దంపతులుఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వరరెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి భక్తుల సహకారంతో ఆలయం తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతుందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఆలయంలో అన్నదానం నిర్వహించే భక్తులు మూడు నెలల ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది. అదేవిధంగా శ్రీవారి సేవ కోసం మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక సేవ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బి.మల్లేష్, ప్రతాప్, రమాకాత్, రాజు, పూజారి, తిరునగిరి, స్వస్తిక్ స్వామి, నాగరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గీతా జయంతి వేడుకలు

బోథ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌట(బి) గ్రామ శబరిమాత ఆశ్రమంలో గీతాజయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి ప్రారంభమైన ఈ వేడుకలలో మూడు రోజుల పాటు ఉదయం 5.30 గంటల నుంచి గీతాపారాయణం ప్రారంభిస్తున్నారు. కార్యక్రమంలో శబరిమాత ఆశ్రమ భక్తులు పాల్గొన్నారు.

చివరి రోజు ముమ్మరంగా నామినేషన్లు

- ఉట్నూర్ పంచాయతీ సర్పంచ్ స్థానానికి 12 నామినేషన్లు


నామినేషన్ వేస్తున్న మేస్రం భాగ్యలక్ష్మి

ఉట్నూర్,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్‌లో చివరి రోజున సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు సభ్యులు భారీగా తరలిరావడంతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్ దారులు చేరుకున్నారు. ఉట్నూర్ గ్రామ సర్పంచ్ స్థానానికి జాదవ్‌అనిత, సులోచన, మేస్రం భాగ్యలక్ష్మి, అరకకల్పన, మూతిమాధవి, మేస్రంవసంతకుమారి, బొంత సుజాత, కొడప రాధాబాయిలు చివరి రోజు నామినేషన్లు సమర్పించారు. మొదటి రెండు రోజులు రాథోడ్ చారులత, జాదవ్‌సుమన్ బాయి, సంగీత,రాథోడ్‌సులత, వైద్యసుజాతలు సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. దీంతో ఉట్నూర్ సర్పంచ్ స్థానానికి 12మంది మహిళ అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి పోటీ పడుతున్నారు. మండలంలోని క్లస్టర్‌లలో భారీగా సర్పంచ్ అభ్యర్థులతో పాటువార్డు సభ్యుల అభ్యర్థులు ఉండడంతో రిటర్నింగ్ అధికారులు వారికి టొకెన్లు ఇచ్చి కూర్చొబెట్టి బయట గేట్లకు తాళాలు వేసి లోపల ఉన్న వారిలో ఒక్కొక్కరి నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరిస్తున్నారు.

ఏడు పంచాయతీలు ఏకగ్రీవం

ఉట్నూర్ మండలంలో 38 గ్రామ పంచాయతీలకుగాను ఏడు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు వార్డు సభ్యులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి.మండలంలోని గంగాపూర్, కామాయిపేట్, బాబాపూర్, మారుగూడా, తాండ్ర, టక్కుగూడా, నర్సాపూర్‌జె, గ్రామ పంచాయతీలకు పాలక వర్గాలను ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలుస్తుంది.


ఉట్నూర్ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న అనిత

కనుల పండువగా ఆరట్టు మహోత్సవం


పల్లకి ఊరేగింపులో అయ్యప్పస్వాములు

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అయ్యప్ప స్వామి దీక్షలు అత్యంత భక్తి శ్రద్ధల నడుమ కొనసాగుతున్నాయి. మండల కాలం పాటు దీక్షలను ఆచరిస్తున్న భక్తులు.. వివిధ పూజాది క్రతువులతో భక్తి బావాన్ని చాటుతున్నారు. పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్‌లోని హరిహర అయ్యప్ప స్వామి క్షేత్రంలో శనివారం ఆరట్టు ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. మహిళలు మంగళ హారతులను చేతపట్టుకుని ముందుకు నడవగా.. అయ్యప స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. దీక్షదారులు భక్తి గీతాలను ఆలపిస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామివారి నామస్మరణ యంలో ప్రత్యేక పూజలు జరిపి స్వామిని చేస్తూ పల్లకి శోభాయత్రలో పాల్గొనడంతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. దారి పొడవునా కొలిచారు. భక్తులకు మహా అన్న ప్రసాదం భక్తులు పల్లకికి పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అల ఏర్పాటు చేశారు.


పొగ మంచుతో కప్పబడిన పవర్ పోల్



వణుకు పుట్టిస్తున్న చలి..

- అర్లి(టి)లో 9.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు

ఆదిలాబాద్‌అర్బన్/తాంసి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత పెరగడంతో ప్రజలకు వణుకు పుట్టిస్తుంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా చలి తీవ్రత కనిపిస్తుంది.శనివారం జిల్లా గరిష్ట ఉష్ణోగ్రత 27.8 కాగా కనిష్ట ఉష్ణోగ్రత 10.2 డిగ్రీలుగా నమోదైంది. అలాగే భీంపూర్ మండలం అర్లి(టి)లో అత్యల్పంగా 9.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాత్నాలలో 9.5, సోనాలలో 9.6,ఆదిలాబాద్‌రూరల్‌లో 9.8, బోథ్‌లో 9.9, బజార్‌హత్నూర్‌లో 10.2తలమడుగు 10.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో చాలా చోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగి పోతుందని జనం వణికి పోతున్నారు. చీకటి పడితే చాలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. అత్యవసరమైతే వెచ్చని దుస్తులను ధరించి బయటకు వెళ్తున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో మార్నింగ్ వాకర్స్ రైతు కూలీలు, మున్సిపల్ కార్మికులు చలితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు చలిపట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లోనైతే రాత్రిపగలు అనేతేడా లేకుండా చలిమంట కాస్తున్నారు.

వామ్మో.. చలి

గత రెండు రోజుల నుంచి తాంసి మండలంలో చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతుంది.దీంతో దినంలోనూ చలిమంటలు కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాయంత్రం పూట చలి మొదలై ఉదయం 11 గంటల వరకు కూడా చలి తీవ్రత ఉండటంతో చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చీకటి పడిందంటే బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.విద్యార్థులు పాఠశాలకు పోవాలంటేనే గజగజ వణుకుతూ వెళుతున్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.8 : కనిష్ఠం 13.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 30 నవంబరు 2025



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు

ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు : కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో వచ్చే సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని, కోడ్ ముగిసిన వెంటనే ప్రజావాణిని తిరిగి యథావిధిగా పునఃప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రేపు జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడోత్సవాలు

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడోత్సవాలు ఈనెల 1న ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల లోపు(జూనియర్స్), 18 నుంచి 54 సంవత్సరాల(సీనియర్స్) దివ్యాంగులకు ఉదయం 9.30 నుంచి ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రీడోత్సవాలలో పరుగు పందెం, షాట్‌పుట్, చెస్ అంధులకు, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, క్యారమ్స్ శారీరక వికలాంగులకు, అలాగే జావెలిన్‌త్రో, షాట్‌పుట్, పరుగుపందెం బధిర వికలాంగులకు, షాట్‌పుట్, పరుగు పందెంలు మానసిక దివ్యాంగులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు ఈ పోటీలో పాల్గొనాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

తాంసిలో రిజర్వేషన్ల ఖరారు

తాంసి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో నాలుగు జనరల్ స్థానాలకు, రెండు ఎస్టీ జనరల్‌కు, మూడు స్థానాలను జనరల్ మహిళలకు, ఒక స్థానం బీసీ జనరల్‌కు, ఒక స్థానాన్ని బీసీ మహిళకు, రెండు స్థానాలు ఎస్టీ జనరల్ కు, ఒక స్థానం ఎస్సీ మహిళకు కేటాయించారు. తాంసి స్థానాన్ని జనరల్‌కు, జామిడి ఎస్సీ జనరల్ కు, కప్పర్ల జనరల్‌కు, హస్నాపూర్ జనరల్‌కు, పొన్నారి ఎస్టీ జనరల్‌కు, సావా ర్గాప్ జనరల్ మహిళకు, పాలోడి జనరల్ మహిళకు, గిరిగావ్ జనరల్ మహిళకు, గోట్కురి బీసీ మహిళకు, వడ్డాడి బీసీ మహిళకు, బండలాగాపూర్ ఎస్టీ మహిళకు, లింబుగుడా ఎస్టీ జనరల్‌కు, అట్నం గుడా జనరల్‌కు, అంబుగావ్ ఎస్టీ జనరల్‌కు కేటాయించారు.

అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు పంచాయతీ ఎన్నికలు పరీక్షగా మారాయి. గ్రామాల్లో కార్యకర్తల మధ్య సమన్వయం కుదిరించి గెలుపొందడం నేతలకు పెద్దసవాల్‌గా మారింది. తమ అభ్యర్థులను గట్టెక్కించేందుకు నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీటైన అభ్యర్థుల ను బరిలో దింపుతూ మద్దతుగా నిలుస్తున్నారు.



నేతలకు.. పంచాయతీ పరీక్ష!



పల్లెపోరును సీరియస్‌గా తీసుకుంటున్న ఎమ్మెల్యేలు

- జిల్లాలో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు
- ముఖ్య కార్యకర్తలతో వరుస సమావేశాలు, భేటీలు
- రంగంలోకి దిగుతున్న నేతలు.. నేరుగా కార్యకర్తలకు ఫోన్లు
- రసవత్తరంగా మారుతున్న పల్లె రాజకీయాలు

ఆదిలాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పోరులో పట్టు సాధించి రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు నేతలు పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. శనివారంతో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆదివారం నుంచి రెండవ విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానున్నాయి. దీంతో నేతలు మరింత స్పీడ్‌ను పెంచుతున్నారు. కొంత మంది అభ్యర్థులను విత్‌డ్రా చేయించి తమ అభ్యర్థుల గెలుపునకు అనుకూల పరిస్థితులను కల్పిస్తున్నారు. మెజార్టీ పంచాయతీలను దక్కించుకుని పార్టీ అధిష్ఠానం వద్ద మరింత పలుకుబడిని పెంచుకునే విధంగా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు కసరత్తు చేస్తున్నారు. సాధారణంగానే స్థానిక ఎన్నిక లు అధికార పార్టీకి కొంత అనుకూలంగానే ఉంటాయన్న టాక్ వినిపిస్తోంది. కానీ జిల్లాలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఖానాపూర్ నియోజకవర్గం మినహా.. ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారింది. మొత్తానికి పంచాయతీ పోరుతో పల్లె రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి.

చేరికలపై ప్రత్యేక దృష్టి

పార్టీ అభ్యర్థుల గెలుపునకు కలిసి వస్తుందన్న చోట నేతలు చేరికలపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. గ్రామస్థాయి నేతలకు గాలం వేస్తూ కండువాలు మార్పేస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థులకు అండగా నిలిచే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో అన్ని పార్టీల్లో చేరికల జోరు కనిపిస్తోంది. ముఖ్యంగా బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలో పోటాపోటీగా చేరికలు జరుగుతున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్, కాంగ్రెస్

(తరువాయి 6వ పేజీలో....)

కార్యకర్తలకు బుజ్జగింపులు

ఇన్నాళ్లు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ.. అసమ్మతితో ఉన్న కార్యకర్తలను బుజ్జగిస్తూ మద్దతును కూడగడుతున్నారు. నేరుగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు రంగంలోకి దిగి కార్యకర్తలకు ఫోన్లు చేస్తూ పరిస్థితిని ఆరా తీస్తున్నారు. గ్రామాల్లో ఎవరు బరిలో ఉంటే బాగుంటుందన్న అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. అందరి అభిప్రాయం మేరకే అభ్యర్థులను బరిలోకి దింపుతున్నారు. నేరుగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలు నేరుగా ఫోన్లు చేయడంతో గ్రామస్థాయి కార్యకర్తల్లో మరింత ఉత్సాహం కనిపిస్తోంది. ఎన్నికల తర్వాత గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతామంటూ నేతలు హామీలు ఇవ్వడం తో కార్యకర్తలు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించే విధంగా వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తుంది. గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ఉన్న అన్ని పార్టీల నేతలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బోరిగామలో వైద్యశిబిరం

- పాల్గొన్న జిల్లా న్యాయాధికారి

ఇచ్చోడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరిగామ గ్రామంలో లీగల్ లిట్రసీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రిమ్స్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గ్రామస్తులకు వైద్య చికిత్సలు నిర్వహించిన అనంతరం మందులను పంపిణీ చేశారు. శిబిరానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, సహా సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్, పీపీ ముస్కు రమణారెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోండి వర్క్‌షాప్

ఉట్నూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఏకలవ్య గిరిజన వనరుల కేంద్రంలో ఆదివారం గోండి వీక్షనరీ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు బోలిచేతో ఫౌండేషన్ బోర్డు సభ్యులు సిడాం కిరణ్, ఆత్రం మోతిరామ్‌లు తెలిపారు. ఈ గోండి వీక్షణరీ వర్క్‌షాపులో అంతర్జాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ గోండి పదజాల సంపదను భద్రపరచడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి బోలిచేతో ఫౌండేషన్ సీఈఓ, నేతిసాయికిరణ్, సిడాం అర్జు, తొడసం కైలాస్, గోండి పెద్దలు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

నేరడిగొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేజాపూర్ గ్రామంలో గల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సీపీఆర్ విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సద్దాం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మారుతున్న జీవన శైలి కారణంగా గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకస్మికంగా గుండెపోటు వచ్చినప్పుడు, వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను ఎలా కాపాడవచ్చో? ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వణుకు పుట్టిస్తున్న చలి

- మళ్లీ బెంబేలెత్తిస్తున్న చలిపులి
- అర్లి(టి)లో 9.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత



- తాంసిలో దినంలో చలి మంటలు కాగుతున్న చిన్నారులు
- పట్టణంలో కమ్ముకున్న పొగమంచు

వివరాలు 7వ పేజీలో...





తుకారం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

మడావి తుకారం స్ఫూర్తితో ఉన్నతవిద్యను అభ్యసించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యేవెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దివంగత ఆదివాసీ ఐఏఎస్ అధికారి మడావి తుకారాం స్ఫూర్తితో గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని తుకారాం లింగోజి తండా ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న తుకారాం విగ్రహానికి 27వ వర్ధంతి పురస్కరించుకుని పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులలో తొలితరం ఏఎస్ అధికారి మడావి తుకారాం మారుమూల గిరిజన గ్రామంలో పుట్టి ఉన్నత విద్యను చదివి ఐఏఎస్ అధికారిగా ఎదిగారన్నారు. ఇదిలా ఉండగా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రంసుగుణ కూడా తుకారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు తుకారాం కుటుంబసభ్యులతో పాటు లక్కెటిపేటకు చెందిన యూత్ సభ్యులు, రాయిసెంటర్ ప్రతినిధులు ఆదివాసీ వాయిద్యాలతో ర్యాలీగా వచ్చి తుకారాం విగ్రహం వద్ద గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలతో పూజలు చేసి నివాళులర్పించారు. ఇందులో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూరు దాదిరావు, ఆదివాసీ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సెడ్మకి రామారావు, మాజీ సర్పంచ్ సలాంశ్యామ్‌రావు, అర్కశ్యామ్‌రావు, తొడసం జనార్ధన్, ఆత్రం మారుతి, చెడుమకి భగవంతురావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో విజయం సాధించిన జట్లకు బహుమతులు పంపిణీ చేశారు.

జిల్లాలో అధ్యయనానికి అపారమైన అవకాశాలు

- కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లాలో పూర్తైన శిక్షణ అధికారుల పర్యటన
- కలెక్టరేట్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం



శిక్షణ అధికారులతో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధ్యయనం, పరిశీలనకు అపారమైన అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ శిక్షణలో భాగంగా జిల్లా పర్యటన పూర్తి చేసుకున్న సివిల్ సర్వీస్ అధికారుల బృందానికి నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు సమర్థవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. అంతకు ముందు శిక్షణలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ పర్యటనలో అధ్యాయనం చేసిన అంశాలను, జిల్లాలోని వివిధ రంగాల పనితీరును ఆసక్తిగా గమనించామని తెలిపారు. జిల్లా యంత్రాంగం అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, కోఆర్డినేటర్ స్వామి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో సత్వర న్యాయం



కలెక్టర్ రాజర్షి షాను సన్మానిస్తున్న జిల్లా న్యాయాధికారి, తదితరులు

- జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు
- కోర్టు కాంప్లెక్స్‌లో సదస్సు
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): న్యాయ, పోలీస్, ఆబ్కారీ, జైలు శాఖల అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా న్యాయాధికారి కే.ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన న్యాయ అధికారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్నందుకుగాను కలెక్టర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ... అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక పెండింగ్ కేసులను, పోక్సో, గంజాయి వంటి కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. జిల్లా కోర్టులోని వివిధ విభాగాల్లో అక్టోబర్ మాసాంతానికి 7310 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, 98 కేసులు దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... 18 భూసేకరణ కేసుల 66 లక్షల రూపాయలకు సంబంధించిన వివరాలను సీసీఎల్ఏ నుంచి ఇరిగేషన్, ఆర్థిక శాఖకు పంపించి వాటి పరిష్కారానికి చేస్తున్నామని తెలిపారు. ఏజెన్సీ ఏరియాలో సివిల్ సూట్స్ కేసులను శనివారం విచారణ జరపడం జరుగుతుందని, పాత ఏజెన్సీ కేసులను ఆర్డీఓ, సబ్ కలెక్టర్ పరిధిలో విచారణకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో న్యాయాధికారులు వివేక్ కుమార్, లక్ష్మీ కుమారి, సీఎం రాజ్యలక్ష్మి, డి.హుస్సేన్, మౌనిక, పోలీస్, జైలు, అబ్కారీ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో మాస్క్‌మ్యాన్ కలకలం

వివరాలు 7వ పేజీలో...

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నేరడిగొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు సోలంకి శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ సభ్యులతో కలిసి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల నుంచి సాగు వివరాలు, పెట్టుబడి ఖర్చులు, దిగుబడి అప్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలా దేవి

హక్కులు, చట్టాలపై అవగాహన తప్పనిసరి

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలు, హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శనివారం సంజయ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిజర్వ్ పోలీస్ లైన్‌లో పౌర హక్కుల రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అన్నివర్గాల వారికి రాజ్యాంగం ద్వారానే హక్కులు వచ్చాయన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అరవర్చుకోవాలని సూచించారు. జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.

ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

ఉట్నూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గిరిజన విద్యార్థులు 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రీ మెట్రిక్స్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబాజి జాదవ్ తెలిపారు. 5 నుంచి 8వ తరగతి వరకు చదువుకుంటున్న డే స్కాలర్స్ ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం, 9-10 తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు రాజీవ్ విద్యా జీవన పథకం కింద ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు వచ్చేనెల 10లోగా చేసుకోవాలన్నారు. కులం, ఆదాయం, బ్యాంకు ఖాతా నెంబర్, పాస్‌ఫోర్టు సైజు ఫొటోలతో పాటు అటెండెన్స్ సర్టిఫికేట్లు జతపరచాలన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- అధికారులకు ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనలు
- ఇచ్చోడలో ఎన్నికల నామినేషన్ కేంద్రాల పరిశీలన



ఇచ్చోడ నామినేషన్ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్

ఇచ్చోడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని సిబ్బందికి ఆయన ఆదేశించారు. అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. నామినేషన్లకు చివరి రోజు కావడంతో ఇచ్చోడ గ్రామ పంచాయతీ క్లస్టర్‌లో దుబార్‌పేట్, అడేగామ(బి), అడేగామ(కె) గ్రామపంచాయతీల నామినేషన్ల స్వీకరణకు అభ్యర్థులు క్యూ పద్ధతిని పాటించారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా ప్రశాంత వాతావరణంలోనే నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో సమస్యలను సృష్టించే వారిని గుర్తించి బైండోవర్ చేస్తూ కట్టడి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటుచేయడం జరిగిందని ఎన్నికలలో ప్రభావితం చేయకుండా డబ్బు, మద్యం ఇతరత్రా సామగ్రి తరలకుండా పర్యవేక్షించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తగు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ సీఐ రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఇచ్చోడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు అండర్ 18తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గీతాంజలి తెలిపారు. 29, 30, డిసెంబరు 1వ తేదీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి ఇచ్చోడ గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు హారిక, శ్రీసాక్షితలు ప్రాతినిథ్యం వహిస్తారని పాఠశాల పీడీ ప్రవంతి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల సిబ్బంది అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ గీతాంజలి, పీడీ ప్రవంతి